

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నల్లపోచమ్మ తల్లికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పూజలు

మన్సూరాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ బాలాజీ నగర్‌కాలనీలో గల నల్లపోచమ్మ తల్లికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. నల్లపోచమ్మ తల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవంలో భాగంగా డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన సుధీర్‌రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టంగుటూరి నాగరాజు, యువ నాయకుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి, యనాల కృష్ణారెడ్డి, కాలనీవాసులు మోహన్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, వెంకటేశ్వర్లు, కొండారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్, జంగారెడ్డి, సంధ్య, కళ్యాణి, మంజుల పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహగుప్తా

పారిశుధ్య పనితీరు మెరుగుపరచాలి: నర్సింహగుప్తా

దిల్‌సుఖ్‌నగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రతి కాలనీలో పారిశుధ్య పనితీరును మెరుగుపరచాలని, స్వచ్ఛత పాటించాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అధికారులను సూచించారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్‌ను చైతన్యపురిలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యూమారుతీనగర్, న్యూనార్ మారుతినగర్, పణిగిరికాలనీ, లక్ష్మీనర్సింహా కాలనీలో పారిశుధ్య పనులు నిర్వహించారు. రోడ్లపై ఉన్న చెత్తను, ఖాళీ ప్రదేశాలలో ఉన్న చెత్త, చెదారాన్ని తొలగించి, ప్రత్యేక వాహనాల్లో తరలించారు. కార్యక్రమంలో శానిటేషన్ డీఈ చందన చౌహాన్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



శానిటేషన్‌పై అవగాహన కార్యక్రమంలో కార్పొరేటర్ లచ్చిరెడ్డి, డీసీ యాదయ్య

పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుకోవాలి : లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు తమ పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. వర్షాకాలం దృష్ట్యా శానిటేషన్‌పై బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలందరూ తమ ఆరోగ్యాలను కాపాడుకోవడానికి పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు. కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో చెత్తకుప్పలు, రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని ఆయన సంబంధిత అధికారులను సూచించారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, శానిటేషన్ డీఈ నీలిమా, కాలనీవాసులు పాల్గొన్నారు.

డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల క్లీనింగ్



డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను క్లీన్ చేస్తున్న శానిటేషన్ సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గురువారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సిబ్బంది డ్రైనేజీ మ్యాన్‌హోళ్లతో పాటు ఓపెన్ నాలాలను క్లీనింగ్ చేశారు. అదేవిధంగా వార్డుల్లో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని శుభ్రం చేశారు. కుంట్లూర్ ప్రభుత్వ పాఠశాలలో కంపోస్ట్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ దశరథ, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ దగ్గరుండి సిబ్బందితో పనులు చేయించారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వంద రోజుల యాక్షన్ ప్లాన్ పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నామన్నారు.



తుర్కయాంజాల్ సహకార సంఘం చైర్మన్ సత్తయ్యతో పీఏసీఎస్ సెక్రటరీలు

తుర్కయంజాల్ సహకార సంఘాన్ని సందర్శించిన పీఏసీఎస్ సెక్రటరీలు

హయత్‌నగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సహకార విద్య, శిక్షణ, ఇంటిగ్రేటెడ్ కార్యక్రమంలో భాగంగా గురువారం తెలంగాణ రాష్ట్రంలోని పీఏసీఎస్ సహకార సంఘాల సెక్రటరీలు తుర్కయంజాల్ సహకార సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక సహకార సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య డైరెక్టర్లను కలిసి సంఘం రైతులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సహకార సంఘం అభివృద్ధి కోసం చేపడుతున్న చర్యలను తెలుసుకున్నారు. అనంతరం బీఎన్‌రెడ్డి, కొహెడా బ్రాంచిలను, గోదాంను పరిశీలించారు. కార్యక్రమంలో సీఈవో ప్యారల్ల జి. ఈశ్వర్‌రావు, తుర్కయంజాల్ సహకార సంఘం సెక్రటరీ రాందాసు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతి



మాన్‌సింగ్ (ఫైల్)

హయత్‌నగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకొని ఇంటికి వస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ బైకును టిప్పర్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన గురువారం రాత్రి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ దొంగతండాకు చెందిన రమావత్ మాన్‌సింగ్(43) తొర్రూర్‌లో కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. మాన్‌సింగ్ యాదాద్రి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. గురువారం విధులు ముగించుకొని రాత్రి 8గంటల సమయంలో ఔటర్ రింగ్ రోడ్ సర్వీస్‌పై పల్సర్ బైక్‌పై ఇంటికి వస్తుండగా పెద్దఅంబర్‌పేట్ పసుమాముల మధ్యలో టిప్పర్ అకస్మాత్తుగా ప్రమాదవశాత్తు బైక్‌పై వస్తున్న మాన్‌సింగ్ టిప్పరును ఢీకొని తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మాన్‌సింగ్‌కు భార్య, ఓ కూతురు, ఓ కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న హయత్‌నగర్ పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎత్తైన స్పీడ్ బ్రేకర్లు.. లోతైన గుంతలు!



విజ్ఞాన్‌పురికాలనీ రోడ్డుపై ఏర్పడిన గుంతలు.. రోడ్డు పక్కనే నిలిచిన నీరు

- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని మీర్‌పేట్ మునిసిపల్ అధికారులు
- అధ్వానంగా మారిన విజ్ఞాన్‌పురికాలనీ రోడ్డు

సరూర్‌నగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అది నాగార్జునసాగర్ రహదారి నుంచి ఇన్నర్ రింగ్‌రోడ్డులోని వినోభానగర్ వరకు గల లింకు రోడ్డు. మధ్యలో మీర్‌పేట్, లెనిన్‌నగర్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ, బాలాపూర్‌తో రహదారితో పాటు అనేక కాలనీలు.. వాటన్నింటికీ ఇదే దగ్గరి దారి.. అయినా అధికారులు నడుమ రహదారి నిర్వహణను గాలికొదిలేశారు. అటు ప్రశాంతినగర్ ట్రాన్స్‌కో నుంచి బీఎన్‌రెడ్డినగర్‌కు వెళ్లే దారిలోని హనుమాన్ టెంపుల్ వరకు బాగానే ఉన్నా.. ఇటు టెంపుల్ నుంచి సాగర్ రహదారికి వెళ్లే విజ్ఞాన్‌పురికాలనీలోని రోడ్డు మాత్రం అధ్వానంగా మారింది. అడుగడుగునా ఎత్తైన స్పీడ్ బ్రేకర్లు.. వాటి పక్కనే లోతైన గుంతలు.. అది చాలదన్నట్లు భారీ వాహనాలు రాకుండా ఏర్పాటు చేసిన ఇనుప రాడ్లు.. స్థూలంగా ఇదీ ఈ రోడ్డులోని దుస్థితి..!

ఏళ్లుగా ఇదే పరిస్థితి..

మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో గల విజ్ఞాన్‌పురికాలనీ ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. దాదాపు దశాబ్దకాలంగా ఇక్కడ ఇదే పరిస్థితి నెలకొంది. సాగర్ కాంప్లెక్స్ సిగ్నల్‌తో పాటు నుంచి ఈ కాలనీ మీదుగా పలు ప్రాంతాలకు దగ్గరి దారి ఉంది.



స్పీడ్ బ్రేకర్, గుంతల కారణంగా అదుపు తప్పుతున్న వాహనదారులు

దానిని గతంలో 60 అడుగుల మేర విస్తరించాలని ప్రతిపాదనలు సైతం చేశారు. అయితే స్థానికుల అభ్యంతరంతో ఆ ప్రతిపాదన మధ్యలోనే ఆగిపోయింది. అయితే ఉన్న రోడ్డునైనా కాస్త మెరుగు పరుస్తారనుకుంటే ఆ దిశలో చర్యలు తీసుకుంటున్న దాఖలాలే కనిపించడం లేదని వాపోతున్నారు. విజ్ఞాన్‌పురి కాలనీలోని హనుమాన్ టెంపుల్ సమీపంలోని 'ఎస్' టైపు మలుపు దాటగానే ఎత్తైన స్పీడ్ బ్రేకర్లు, లోతైన గుంతలతో రోడ్డు అధ్వానంగా తయారయింది. గతంలో నడుమ స్పీడ్ బ్రేకర్ల కారణంగా అనేక మంది వాహనదారులు అదుపు తప్పి కిందపడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. తాజాగా వాటి పక్కనే లోతైన గుంతలు కూడా ఏర్పడడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. రోడ్డు

వంద రోజుల యాక్షన్ ప్లాన్ ఈ రోడ్డుకు వర్తించదా?

ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా నిర్వహిస్తున్న వంద రోజుల యాక్షన్ ప్లాన్ ఈ రోడ్డుకు వర్తించదా? అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డుపై గుంతల కారణంగా స్థానికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిస్తే పక్కనే ఉన్న కాలనీ వాసుల ఇళ్ల ముందుకు వర్షపు నీరు చేరి మడుగుగా మారుతోంది. దాంతో వాహనదారులు ఆ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఎత్తైన స్పీడ్ బ్రేకర్లు కాదు, జీవితం వంటి పోల్ వీలైతే ఇబ్బందికరంగా మారాయంటే ఇక ద్విచక్ర వాహనదారుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా మీర్‌పేట్ మునిసిపల్ అధికారులు స్పందించి విజ్ఞాన్‌పురి కాలనీ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. స్పీడ్ బ్రేకర్లు తొలగించి, గుంతలను పూడ్చేయాలని సూచిస్తున్నారు.



నడిరోడ్డులో ఎత్తైన స్పీడ్ బ్రేకర్.. దాని పక్కనే లోతైన గుంతలు

నంబర్.13 వద్ద సైతం ఒకే దగ్గర రెండు స్పీడ్ బ్రేకర్లు ఉండడం గమనార్హం. ఈ రోడ్డు మొదలు నుంచి చివరి దాకా అస్తవ్యస్తంగానే ఉన్నప్పటికీ అధికారులు దానిని బాగు చేయడానికి ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రూ.3కోట్లతో బాటసింగారం పాత హైవే విస్తరణ

- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామంలో నుంచి ఉన్న పాత హైవే రోడ్డు విస్తరణకు హెచ్ఎండీఏ నిధులు మంజూరు చేసింది. రూ.3కోట్లతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు గురువారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత హైవే రోడ్డు ఇరుకుగా మారడంతో గ్రామస్తుల కోరిక మేరకు హెచ్ఎండీఏ ద్వారా నిధులను మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం 12 అడుగులతో ఉన్న రోడ్డు 25 అడుగులకు విస్తరించనున్నట్లు స్పష్టం చేశారు. త్వరలోనే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీంతో ఆ రోడ్డులో వాహనాల రాకపోకలు సులభతరం కానున్నాయన్నారు. ప్రజా పాలనలో ప్రతీ ఒక్క కుటుంబానికి న్యాయం జరుగుతుందన్నారు. అలు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజాపాలన ప్రభుత్వం ప్రజల మన్ననలు చూరగొంటుందన్నారు. అనంతరం బాటసింగారంలోని వాసవీ సాయి శ్రీనివాస వేంకటేశ్వరస్వామి



రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

వార్షికోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, హెచ్ఎండీఏ ఈఈ వెంకన్న, ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్‌చారి, మాజీ జడ్పీటీసీ దేవిడ సుగుణ్, మాజీ సర్పంచ్ రాదమ్మ, నాయకులు గోరికంటి, ఉపేందర్ మారు తిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మార్కెట్ వైస్ చైర్మన్ శ్రీనివాస్

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

సైదాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు గురువారం సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. దాదాపు 40ఏళ్లుగా పేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. కొందరు సొసైటీల పేరుతో ఈ స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. సత్వరమే గుడిసెవాసులకు పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొట్ల శ్రీనివాస్, డివిజన్ మాజీ అధ్యక్షుడు నాగరాజుదాస్, గౌతియా, కిషన్ నాయక్, అలివేలు, కృష్ణవేణి, లక్ష్మణ్‌రావు, శంకర్‌నాయక్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

శ్రీసాయినగర్‌కాలనీ సమస్యలు పరిష్కరించండి

మన్సూరాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ పరిధిలోని మన్సూరాబాద్ శ్రీసాయినగర్‌కాలనీ సమస్యల వలయంలో చిక్కుకుని సతమతమవుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడని కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు పోకబోయిన గణేష్‌యాదవ్, సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు రోడ్డు నంబర్2లో ప్రధాన రోడ్డుపై గల నాలా స్లాబ్ కూలిపోవడంతో భారీగా రంధ్రం ఏర్పడి ప్రమాదాలు జరుగుతుండగా.. మరో వైపు తాగునీటిలో మురుగునీరు కలుషితమై నీరు తాగలేని స్థితిలో తాము నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ 20రోజుల క్రితం ధ్వంసమైన స్లాబ్ మరమ్మతులు చేయడంలో జీహెచ్ఎంసీ అధికారులు, పదిరోజులుగా కలుషిత నీరు వస్తున్నా పట్టించుకోవడంలో జలమండలి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. స్లాబ్ కూలిపోవడంతో ఇటీవల ఓ లారీ, సుమారు మూడు కార్లతో పాటు ఒక వ్యక్తి ప్రమాదానికి గురయ్యారని, అటుగా రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొందన్నారు. రెండు వారాలుగా అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని, నామమాత్రంగా బారికేడ్ ఏర్పాటు చేసినప్పటికీ ప్రమాదాలు మాత్రం ఆగ



శ్రీసాయినగర్‌కాలనీ రోడ్ నంబర్.2లో నాలా ధ్వంసమై ప్రధాన రోడ్డుకు మధ్యలో ఏర్పడ్డ భారీ రంధ్రాన్ని చూపుతున్న గణేష్‌యాదవ్, సభ్యులు

గుతూనే ఉన్నాయన్నారు. వెంటనే ఇరు శాఖల అధికారులు సమన్వయంతో ధ్వంసమైన నాలాకు స్లాబ్ ఏర్పాటుతో పాటు కలుషితనీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. కాలనీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీవన్ మేష్‌కుమార్, యాదగిరి, హనుమంతరావు, మురళీమోహన్ పాల్గొన్నారు.

పాలస్తీనా, ఇరాన్‌లపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలి

సంతోష్‌నగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పాలస్తీనా, ఇరాన్‌లపై ఇజ్రాయిల్ చేస్తున్న అక్రమ దాడులను ఖండిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గురువారం ఐఎస్‌సదన్ చౌరస్తాలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం హైదరాబాద్ సౌత్‌జిల్లా సెక్రటరీ విఠల్ మాట్లాడుతూ అంతర్జాతీయ చట్టాలను, ఒప్పందాలను ఉల్లంఘిస్తూ తనకు ఇష్టం వచ్చినట్లుగా ఇజ్రాయిల్ ఇరాన్‌పై దాడులు చేస్తున్నదని వాటిని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మీనా, అబ్దుల్ లతీఫ్, బాలునాయక్, మహ్మద్ జోహర్, సత్తార్ పాల్గొన్నారు.

భర్తపై మహిళ దాడి : కేసు నమోదు

మన్సూరాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తాగుడు కారణంగా పదే పదే ఘర్షణ పడుతున్న భర్తపై ఓ మహిళ తన బంధువులతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. నాగోల్ బండ్లగూడ పరిధిలోని జైపురికాలనీకి చెందిన సిహెచ్ రాములు(44)కు భార్య సిహెచ్ విజయ, కుమారులు సిహెచ్ మోహన్, సిహెచ్ సతీష్ ఉన్నారు. భార్య విజయతో తాగుడు కారణంగా పదేళ్లుగా భార్యకు దూరంగా తన సోదరుడు సిహెచ్ సుదర్శన్ ఇంటి వద్ద రాములు ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం భార్య విజయ తన సోదరుడు బుర్ర మహేంద్ర, సోదరి బుర్ర ధనలక్ష్మి, కుమారులతో పాటు మరికొందరు గుర్తు తెలియని వ్యక్తులతో కలిసి వచ్చి తన మరిదిపై దాడి చేసింది. అంతేకాకుండా అక్కడే ఉన్న భర్త రాములుపై హాకీ బ్యాటు, పెప్పర్ స్ప్రేలతో సుదర్శన్ ఇంట్లో ఉన్న రాములు, మరో వ్యక్తి సిహెచ్ రాజుపై దాడి చేయడంతో పాటు రాములు వద్ద ఫోన్, పర్సు, ఏటీఎంలను లాక్కుని వెళ్లారు. ఈ దాడిలో తల, చేతులు, కాళ్లకు తీవ్రంగా గాయాలైన రక్తస్రావంతో సమీపంలోని ఆస్పత్రిలో చేరారు. కాగా లాక్కెళ్లిన ఏటీఎం ద్వారా రూ.1లక్ష నగదును సైతం వారు డ్రా చేసినట్లు తెలిపారు. దీనికి పాల్పడ్డ భార్యతో పాటు ఆమె సోదరుడు బుర్ర మహేంద్ర, కుమారులపై చర్యలు తీసుకోవాలని బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

వంపాపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్‌లోని మిధాని ఆర్టీసీ బస్ డిపోలో శుక్రవారం ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం డయల్ యువర్ డీఎం ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ విజయ్‌కుమార్ తెలిపారు. డిపో పరిధిలోని ఆయా కాలనీల ప్రజలు ఉదయం 11గంటల నుంచి 12గంటల మధ్య సెల్ నెంబర్ 9959226139కు ఫోన్ చేసి తమ సమస్యలతో పాటు సలహాలు, సూచనలు తెలియజేయాలని డీఎం కోరుతున్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హయత్‌నగర్ డిపోలలో..

హయత్‌నగర్ : హయత్‌నగర్ ఆర్టీసీ 1, 2 డిపోలలో శుక్రవారం మధ్యాహ్నం 12గంటల నుంచి 1గంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో-2 మేనేజర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ విలువైన సూచనలు సలహాలు అందివ్వాలని కోరారు. ప్రయాణికులు ఫోన్ నంబర్ 9959226419, 9959226138లో సూచనలు, సలహాలు అందివ్వాలని కోరారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్ : ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పంచాయతీ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో మూడు నెలలుగా రేకుల ఇంట్లో ఆరిఫాస్ దుర్గాప్రసాద్(హిజ్రా) నివాసం ఉంటున్నారు. ఏపీలోని భీమర్ అంటే ఫ్యూర్ కోనసీమ జిల్లాకు చెందిన నామాల చెన్నకేశవ(21) ఎలక్ట్రీషియన్. కాగా మూడు నెలల క్రితం చెన్నకేశవ అబ్దుల్లాపూర్‌మెట్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి వచ్చి హైజ్రాతో సహజీవనం చేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఇటీవల ఈ విషయం తెలుసుకున్న చెన్నకేశవ కుటుంబ సభ్యులు తరుచూ ఫోన్‌చేసి మందలిస్తున్నారు. అయినా అతడు వారితో వెళ్లేందుకు నిరాకరించాడు. అయితే బుధవారం చెన్నకేశవ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి తల్లి నామాలదేవికి హిజ్రా వైష్ణవి ఫోన్‌చేసి చెప్పింది. సెల్‌ఫోన్ విషయంలో చెన్నకేశవ, వైష్ణవి మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. గొడవ అనంతరం అతడు బీరతో స్నానం చేసి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి సోదరుడు నాగరుక్కామరంగనా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చాదర్‌ఘాట్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

చాదర్‌ఘాట్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రానున్న బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన రౌడీ షీటర్లకు ఇన్‌స్పెక్టర్ కేబీ మురారీ గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో 26 మంది రౌడీ షీటర్లుండగా ఇందులో ప్రస్తుతం 17మంది రౌడీ షీటర్లు అందుబాటులో ఉన్నారని ఆయన వివరించారు. వివిధ కారణాలతో మిగతా 9మంది రౌడీ షీటర్లు ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రౌడీ షీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. బోనాల ఉత్సవాలు పూర్తయ్యే వరకు రౌడీ షీటర్లు నిరంతరం పోలీసులకు అందుబాటులో ఉండాలన్నారు. ఎప్పుడు పోలీస్‌స్టేషన్‌కు పిలిచినా వచ్చి హాజరు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ కేబీ మురారీ

అందులో జోక్యం చేసుకున్నట్లుగా గాని, సంఘ విద్రోహులతో సంచరిస్తున్నట్లుగా గుర్తించిన వెంటనే ముందస్తు చర్యల్లో భాగంగా అరెస్టు చేస్తామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోను రౌడీ షీటర్లు నగరం విడిచి వెళ్లరాదన్నారు. ఒకవేళ వ్యక్తిగత తప్పని పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

ఎల్‌బీనగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని కొత్తపేట చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ నాయకుడు రంజిత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య, ఇమామ్‌అలీ, నాయకులు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, జంగారెడ్డి పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ ఎస్సీ సెల్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పాండి పెంటయ్య ఆధ్వర్యంలో గురువారం పెద్దఅంబర్‌పేట్ చెక్‌పోస్టు వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ చిత్రం వేసిన కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి మిత్ర మండలి జిల్లా అధ్యక్షుడు భాస్కర్, సురేందర్‌గౌడ్, నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ గడ్డిఅన్నారం అధ్యక్షుడు బద్దుల వేణుయాదవ్ ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్ వద్ద రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిషన్‌సింగ్

ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ బద్దుల వెంకటేష్‌యాదవ్, నాయకులు కూకుట్లపల్లి సత్యనారాయణ, కొత్తపల్లి రెడ్డి, తుడి గోవర్ధన్, సునీల్‌బాబు, ఆనంద్‌మూర్తి, కృష్ణ, సురేష్, శ్రీనివాస్, ధర్మరాజు, వెంకటచారి, వీరేష్, అరుణ్, శ్రీనివాస్, శరత్ పాల్గొన్నారు.

మన్సూరాబాద్ : నాగోల్ డివిజన్ బండ్లగూడ గ్రామ కమిటీ అధ్యక్షుడు చెరుకు భవాని శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో బండ్లగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ కమిటీ చైర్మన్ ఎం. అరుణ, గ్రామకమిటీ ప్రధాన కార్యదర్శి తూర్పాటి నారాయణ, మురళిగౌడ్, సురేష్‌గౌడ్, సహదేవ్‌గౌడ్, రవీందర్, నాగేందర్ పాల్గొన్నారు.

హయత్‌నగర్: రాహుల్ జన్మదిన వేడుకలను తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షులు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుర్కయంజాల్ చౌరస్తాలో కేక్ కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రేవెల్లి యాదగిరి, గుద్ద అర్జున్, శ్రీనివాస్, శ్యామల, శ్రీశైలం, లోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో రక్తపు మరకలు

దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం

సంతోష్‌నగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ సంఘటన గురువారం స్థానికంగా ఒక్కసారిగా కలకలం సృష్టించింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని



ఓ ఇంట్లో గోడలు, కిటికీలు, డోర్లకు రక్తపు మరకలు

ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా ఇంట్లో మొత్తం రక్తపు మరకలు కనిపించాయి. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. రక్తపు మరకలు పోలీసులను సైతం ఉలిక్కిపాటుకు గురిచేశాయి. క్లూస్‌టీం, ఫోరెన్సిక్ టీంలను రప్పించి ఆధారాలను సేకరించారు. తాళం వేసి ఉన్న ఇంట్లో ఎవరు ఉంటున్నారన్న వివరాలను స్థానికుల నుంచి సేకరించారు. ఆ ఇంటికి ఎవరెవరు వస్తుంటారు వారి వివరాలు తెలుసుకోవడానికి పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు.

కుటుంబ సభ్యుల గొడవేనా..

పోలీసుల దర్యాప్తులో బీహార్‌కు చెందిన ధర్మేందర్‌కుమార్(33)తో పాటు మొత్తం ఆ ఇంట్లో ఐదుగురు వ్యక్తులు ఉంటున్నట్లు సమాచారం. ధర్మేందర్‌కుమార్ తరుచూ మద్యం సేవించి వస్తున్నాడు. అదేక్రమంలో బుధవారం రాత్రి కూడా మద్యం సేవించి ఇంటికి వచ్చి మిగతా వారితో గొడవపడ్డాడు. మద్యం మత్తులో కిటికీని చేతితో పగులగొట్టి తీవ్రంగా గాయపరుచుకున్నాడు. దీంతో ఇంటి నిండా రక్తపు మరకలు ఏర్పడ్డాయి. గొడవ అనంతరం మిగిలిన నలుగురు బయటికి వెళ్లిపోగా ధర్మేందర్‌కుమార్ మాత్రం మద్యం మత్తులో అక్కడే పడుకున్నాడు. ఉదయం మత్తు వదిలిన తర్వాత ఇంటికి తాళం వేసి తాను కూడా బయటికి వెళ్లిపోయాడు. ఇంట్లో నుంచి రక్తపు మరకల దుర్వాసన రావడంతో స్థానికులు సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ధర్మేందర్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నట్లుగా సమాచారం. ఇంట్లో రక్తపు మరకలు పెద్దగా ఉండడం ధర్మేందర్ చేతికి గాయం కావడం ద్వారా మరకలు ఏర్పడ్డాయా, లేక మరేదైనా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఇంట్లో ఉండే మిగతా వారి వివరాల గురించి కూడా పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.